


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – ‘మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?’ అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో ‘పీజీ టు కేజీ’ గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది ‘బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే’లో తొలివిడతగా ‘ఫన్ నేనొక్కడినే’. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (31)

**దేవుడు పక్కనున్న రోజు**

నిజంగానే పాట ఆగిపోయిందంటే నమ్మబుద్ధి కాలేదు. కదలకుండా టేపునే పరీక్షగా చూస్తున్నాను.

టేపు తిరుగుతోంది. పాట రావడం లేదు.

"మీరు పెద్ద తప్పు చేశారు. బాబాకి మీపై కోపమొచ్చింది" అంది శ్రీమతి కంగారుగా.

నాకా మాటలు నచ్చలేదు. "కోపమొస్తే, ఎక్కడో ఉండి మన మాటలు విని ఇక్కడి టేపులో పాట ఆపెయ్యడానికి – ఇదేమన్నా పురాణ యుగమా? ఆధునిక యుగం. అందులోనూ కలికాలం. ఈ కాలంలో నాస్తికులు ఆస్తికుల్ని పక్కకు నెట్టేస్తారని బహుశా కాలజ్ఞానంలో బ్రహ్మంగారు కూడా చెప్పినట్లున్నారు" అన్నాను.

"మీరు బ్రహ్మంగారి కాలజ్ఞానం ఎప్పుడు చదివారూ – నాకెప్పుడూ చెప్పలేదు...." అంది శ్రీమతి అనుమానంగా.

"ఇంతోటి దానికి కాలజ్ఞానం చదవాలా? అనుకోని వింతో, విపరీతమో జరిగిందనుకో – అది కాలజ్ఞానంలో ఉండే ఉంటుంది. ఉన్నా లేకున్నా – ఉందని ఎవరైనా అంటే చాలు, నమ్మేవాళ్లు కోకొల్లలు. ఆయన భక్తులు కూడా సంతోషిస్తారు" అన్నాను.

"మీ వితండవాదానికో నమస్కారం కానీ – ముందు టేపులో పాట ఎందుకాగిపోయిందో చెప్పండి" అంది శ్రీమతి.

అటు చూస్తే టేపు ఇంకా తిరుగుతూనే ఉంది. పాట మాత్రం రావడంలేదు.

"ఏముందీ – అక్కణ్ణించి పాట రికార్డయుండదు" అన్నాను. కానీ బుర్రలో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.

"అక్కణ్ణించి అంటే – మీరు బాబాగారి గొంతు మనింట్లో పలక్కూడదన్నారూ – అక్కణ్ణించేనా?"

ప్రశ్నలా అడిగింది కానీ, అది ముళ్లపూడివారిని మించిన వ్యంగ్యం.

నేను బదులివ్వలేదు. రికార్డరు వద్దకెళ్లాను.

ముందు వాల్యూమ్ చూశాను. అది మేమెప్పుడూ వినే పొజిషన్లోనే ఉంది. ఐనా ఓసారి ఆ పొజిషన్ని పైకీ కిందకీ మార్చి చూశాను.

టేపు తిరుగుతోంది. రికార్డర్లో పూర్తి నిశ్శబ్దం.

ఇలా ఎలా జరిగింది?

నిజంగానే దేవుడు మహిమ చూపేడా?

నమ్మడానికి అహం ఒప్పుకోలేదు.

టేపు ఆపాను. అది తీసి మరో టేపు పెట్టాను. అందులో అప్పట్లో ఓపీ రల్హాన్ తీసిన తలాష్ చిత్రంలో పాటలున్నాయి.

ఆ పాటలు నాకు చాలా ఇష్టం. కానీ ఇండియాలో ఐతే రేడియోలో వచ్చినప్పుడు మాత్రమే వినాలి. సిబాకా గీత్‌మాలాలో వాటి ప్రాభవం ఐపోయేక మళ్లీ వినే అవకాశం రాలేదు. ఇప్పుడిక్కడ కనీసం వారానికొకసారైనా వింటున్నాను.

టేపు ఆన్ చేస్తే పాట రాలేదు. టేపు ఆరంభంలో మొదటి నిముషం బ్లాంకుగా ఉంటుంది కదా అనుకున్నాను. రెండు, మూడు, నాలుగు.... పది నిముషాలు గడిచిపోయాయి. పాట రాలేదు.

టేపుని ఫాస్ట్ పార్వర్డ్ చేసి పెట్టాను. పాట రాలేదు.

నాకు కంగారు మొదలైంది.

రికార్డరు పాడయిందా? అదీ – సరిగ్గా నేనా మాట అన్నాక....

ఆ టేపు తీసి ఘంటసాల టేపు పెట్టాను. ఏం ప్రయోజనం లేదు.

నేను కలవరపడుతున్నానని గ్రహించినట్లుంది, "వెంకటేశ్వర సుప్రభాతం టేపు పెట్టండి" అంది అనునయంగా.

మామూలుగా ఐతే చిరాకు పడేవాణ్ణి. కానీ అది నాకు బలహీనక్షణం.

అందులోనూ నాకు ప్రతి చిన్న విషయానికీ పురాణ కథలు గుర్తొస్తాయి. అప్పుడు అంబరీషుడి కథ గుర్తొచ్చింది. ఆయన మహారాజు. జనం క్షేమంకోసం ఏడాది పాటు ద్వాదశి వ్రతం చేశాడు. దీక్ష విరమించడానికి ముందు దూర్వాస మహర్షి వస్తే ఎంతో సంతోషించి ఆయన్ని అతిథిగా ఆహ్వానించాడు. దూర్వాసుడు స్నానం చేసి వస్తానని వెళ్లి ఎప్పటికీ రాకపోతే దీక్షాసమయం ముగుస్తోందని వ్రతభంగం కాకుండా కొంచెం తులసితీర్థం పుచ్చుకున్నాడు. దూర్వాసుడు తిరిగొచ్చి, తనకోసం ఆగకుండా నీళ్లు తాగినందుకు అలిగి ఆయనపై పెద్ద శక్తిని ప్రయోగించాడు.

దూర్వాసుడు అతిథి. దేవుడిలాంటివాడు. ఆయన కోపాన్ని తట్టుకోవాలంటే, ఆయనకంటే పెద్ద దేవుడి ఆసరా కావాలి.

చేసేది లేక అంబరీషుడు విష్ణువుని ప్రార్థించాడు.

ఇప్పుడు నా పరిస్థితీ అదే కాబట్టి – పెద్ద దేవుడైన ఏడుకొండలవాణ్ణి మెప్పించమంటోంది శ్రీమతి.

బలహీనక్షణం కదా – ఏ పుట్టలో ఏ పాముందో అనుకుంటూ, సుప్రభాతం టేపు పెట్టాను.

అదీ పలకలేదు.

శ్రీమతికి ఏడుకొండలవాడంటే గురి. ఆయన కూడా బాబా కోపాన్ని శాంతించలేకపోయాడంటే ఆమెకూ తృప్తిగా లేదు కాబోలు, "కంగారు పడకండి. రికార్డరు పాడైనట్లుంది. గ్యారంటీ పీరియడ్లోనే ఉందిగా" అంటూ వాస్తవానికి వచ్చే ప్రయత్నం చేసింది.

డెక్ పాడయుండొచ్చని నాకూ అనుమానమొచ్చింది. కానీ పాడవడానికి అది ఎన్నుకున్న టైమింగ్ నన్ను కలవరపెడుతోంది.

టేప్ డెక్కి గ్యారంటీ పీరియడ్ ఐపోలేదు. పాడైతే కనుక మరమ్మతు చెయ్యడం కంపెనీదే బాధ్యత. కానీ ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరున్న గ్రుండిగ్ కంపెనీ సరుకది. ఇక్కడున్నన్నాళ్లూ ఫరవాలేదు కానీ ఉన్నట్లుండి ఇలా పాడైపోయే రోగముంటే, ఇండియాకి తీసుకెళ్ళేక నేను దీంతో ఎలా వేగాలి?

అప్పుడు గుర్తొచ్చింది – వాడకంలో ఇబ్బందులొచ్చినప్పుడు (ట్రబుల్ షూటింగుకి) ఏంచెయ్యాలో కొన్ని చిట్కాలు పొందుపర్చిన ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్. కొన్నాక వాటిని చూడాల్సిన అవసరమే రాలేదు. ఇప్పుడొచ్చింది.

ఆ పుస్తకం తీసి శ్రద్ధగా ఆ వివరాలు చదివితే నాకొచ్చిన సమస్యకు కారణమూ, పరిష్కారమూ కూడా అందులో ఉన్నాయి.

టేపు రికార్డరులో ముఖ్యమైన భాగాలు రికార్డింగ్/ప్లేయింగ్ హెడ్స్. వాటిమీద సెన్సార్లుంటాయి. టేపు వాటిని తాకినప్పుడు, టేపుమీద రికార్డయిన శబ్దతరంగాల్ని ఆ సిగ్నల్సు గ్రహిస్తాయి. టేపు ఆ హెడ్సుని అంటి తిరుగుతుంది కాబట్టి, టేపుమీదుండే మెటాలిక్ అక్సయిడ్ కోటింగు కొంచెం కొంచెంగా హెడ్డుకి మలికిగా అంటుతూంటుంది. కొన్నాళ్లయ్యేసరికి ఆ మలికి హెడ్ మీద సెన్సారుని మొత్తం కప్పేస్తుంది. అప్పుడు టేపుమీద రికార్డింగు అవదు. రికార్డయిన మాట బైటకి పలుకదు. ఆ మలికిని పోగొట్టడానికి ఆల్కహాలు వాడొచ్చు. లేదా కంపెనీ వాళ్లు అమ్మే క్లీనింగ్ లిక్విడ్ ఉపయోగించొచ్చు.

ఇది చదివి, 'అరే ఈ మాత్రం నాకు తట్టలేదేమిటీ!' అని సిగ్గు పడ్డాను. ఎందుకంటే, ల్యూనబర్గులో ఉండగా రేడియో–కాసెట్ రికార్డరు కొని వాడాను కదా! అప్పుడు కొత్త కాబట్టి ఇలాంటివన్నీ ముందే చదివి జాగ్రత్తలు తీసుకునేవాణ్ణి. దానికోసం హెడ్ క్లీనింగ్ లిక్విడ్ కొని ఉంచుకున్నాను. చాలాసార్లు వాడాను కూడా. ఐతే ఆ రికార్డరు వాడినప్పుడు టేపులో ఎప్పుడూ ఇలా ఒక్కసారిగా మాట పోలేదు. కొంచె కొంచెంగా శబ్దం తగ్గుతుంటే అర్థం చేసుకుని వెంటనే హెడ్ క్లీన్ చేసేవాణ్ణి.

బెర్లిన్ వచ్చేక టేప్ డెక్ కొన్నప్పుడు దానికి అవసరమైన అదనపు హంగులన్నీ కొన్నాను. వాటిలో హెడ్ క్లీనింగ్ లిక్విడ్ కూడా ఉంది. ఎటొచ్చీ మాన్యువల్లో ట్రబుల్ షూటింగు పేజీ చదవాల్సిన అవసరం రాలేదు. ఎన్నో నెలలుగా ఆ స్టీరియో డెక్కులో పాటలు వింటూ, రికార్డింగులు చేసుకుంటూ బాగా ఎంజాయ్ చేస్తున్నాను.

ఇప్పటికి హెడ్డుకి పట్టిన మలికి – సెన్సార్లని మొత్తం మూసేసినట్లుంది.

శ్రీమతికీ విషయం చెప్పి, టేపు హెడ్ క్లీన్ చేసి ఏడుకొండలవాడి టేపు పెట్టాను.

“కౌసల్యా సుప్రజా రామ” అంది టేపు.

ఆ క్షణంలో ఆ స్వరం నాకు కలిగించిన ఆనంద పారవశ్యం – మాటలకందదు.

“సుప్రభాతం మీకనుకుంటున్నారా, అచ్చం ఆ దేవుడి పోజిచ్చారు!” అని నవ్వింది శ్రీమతి.

పరవశంనుంచి బయటపడి నేనేదో అనేలోగా, “సుప్రభాతమంటే పొద్దున్నే వినిపించాలి. ఎప్పుడు పడితే అప్పుడు ఆ టేపు పెట్టకూడదు. టెస్టింగు ఐపోయిందిగా, ఇక టేపు తీసెయ్యండి” అంది శ్రీమతి.

సెంటిమెంటు – అదీ దేవుడి విషయంలో ఐతే అస్సలు ఉపేక్షించకూడదు.

ఠక్కున ప్లే ఆపి, ఈసారి తలాష్ పాటలు పెట్టాను.

“కర్‌లే ప్యార్....” పాట మొదలైంది.

సంతోషం పట్టలేకపోయాను. “చూసేవా వసూ! దేవుడి మహిమ కాదు. దిసీజ్ సైన్స్” అన్నాను గర్వంగా.

మామూలుగా ఐతే మంచి రిటార్టిచ్చేది. కానీ అంతవరకూ తనూ టెన్షన్లో ఉందేమో, శ్రీమతి కూడా టేపు పలకడంతో రిలీఫ్ ఫీలయింది. అందుకని నెమ్మదిగా, “దేవుడా, సైన్సా అన్నది కాదిక్కడ పాయింటు. మీరు అసలు విషయం మర్చిపోయినట్లున్నారు. మొత్తం వ్యవహారం దేవుడితో మొదలై సైన్సుతో ముగిసింది. ఇందాకా మీరు బాబాని సవాలు చేస్తూ ఆ మాటన్నారో లేదో టేపులో పాట ఆగిపోయింది. కారణం సైన్సే అనుకుంటే, ఆ సైన్సు ఆ క్షణంలోనే ఎందుకు బయటపడాలి? ఇది సైన్సు కాదు, మిరకిల్ అని చెప్పడానికని అనిపించడం లేదా? అలా మీకనిపించకపోయినా నాదో విన్నపం. ఇంకెప్పుడూ మీరిలా దేవుడిపై నమ్మకాలపై తిరకాసుగా మాట్లాడకండి” అంది.

ప్రాధేయపడుతోందా? నచ్చజెబుతోందా? హెచ్చరిస్తోందా? లేక భయపడుతోందా?

భయమని ఎందుకనుకున్నానంటే, అప్పుడు నేనా మాట అన్న ఆ క్షణంలో టేపులో మాట ఆగిపోయినప్పుడు – దేవుడు నా పక్కనే ఉన్న అనుభూతి కలిగి నాకూ కొంచెం భయమేసింది.

ఇప్పుడు టేపులో మాట పలికేదాకా ఆ భయం తొలగలేదు. ఒకసారి భయం తొలగడమేమిటి, నాలోని హేతువాది మళ్లీ విజృంభించాడు.

“భయపడుతున్నావ్ కదూ!” అన్నాను జాలిగా ఆమెను చూస్తూ.

“అలాగే అనుకోండి. కానీ నా మాట వినండి” అంది.

“వింటాను కానీ, వినేముందు నీ భయాన్ని పోగొట్టడం నా బాధ్యత. కాసేపు నేనేం చేసినా అదేమనకుండా చూడాలి” అన్నాను.

"సరే, తర్వాత మాత్రం నా మాట వినాలి" అందామె.

నేనేం చేస్తానో తెలిసుంటే సరే అనుండేది కాదు.

"మేరా ప్యార్ సనమ్" అంటున్న టేపుని ఆపాను. ఆ స్థానంలో కొత్త టేపు పెట్టాను.

"గోవింద కృష్ణజై....."

అది మేము కాసేపటి క్రితం రికార్డు చేసిన టేపు.

చక్కగా పలుకుతోంది. స్టీరియోలో పలుకుతోంది. మునుపటికంటే స్పష్టంగా ఉందా గొంతు.

శ్రీమతి కళ్లు మెరిశాయి. ఆమె మొహంలో సంతోషం.

అప్పుడు నేను ఉన్నట్లుండి, "ఓ దేవుడు కాని దేవుడా! ఇందాకా ఈ టేపు పలకడం మానేస్తే, నా భార్య నీ మహిమ అనుకుంది. అది మహిమ కాదనీ, కాకతాళీయమనీ నాకు తెలుసు. కానీ కొంచెంసేపు – అది మహిమే అన్న భ్రమలో నేనూ, తనూ మానసిక క్షోభ అనుభవించాం. ఇప్పుడు నేను మళ్లీ సవాలు చేస్తున్నాను. నిజంగా నీవు దేవుడివైతే, నీ గొంతు మా ఇంట్లో పలక్కూడదు. ఈసారి టేపు పలకడం మానేస్తే, నేను నిజంగా నీవు దేవుడివని నమ్ముతాను. లేదా నిన్నో అసమర్థుడిగా భావిస్తాను...." అని ఇంకా ఏదో అనబోతుండగా శ్రీమతి చటుక్కున తన చేత్తో నా నోరు మూసింది.

నేనా చేతిని విడిపించుకుని, "నేనేం చేసినా మధ్యలో ఆపకూడదని షరతు. మర్చిపోయావా?" అన్నాను.

"నేనేం మర్చిపోలేదు కానీ ముందిది చెప్పండి! ఈ రోజు మీకేమయింది? రావుగారు బాబాని నమ్మారు. మీకో కాసెట్టిచ్చి ఆయన పాడిన పాటలు రికార్డ్ చేసుకోమన్నారు. చేసుకుంటున్నాం. మీరాయన్ని నమ్మితే నమ్మండి, లేదూ నమ్మకండి. అర్థం లేని ఈ సవాళ్లేమిటి? అవాకులేమిటి? మనకు తెలియని వ్యక్తి గురించి ఇదంతా అవసరమా?" అంది శ్రీమతి.

ఆమె అన్నది సబబే. కానీ మూఢనమ్మకాలు కాకతాళీయాల్లోంచే పుడతాయి. ఆదిలోనే త్రుంచెయ్యకపోతే, అవి వ్రేళ్లూనుకుని మహావృక్షాలుగా మారతాయి. ఆ విషయం శ్రీమతి గ్రహించాలని నా తాపత్రయం.

"కొత్తగా టీకా కనిపెట్టినప్పుడు, దాన్ని ఎలుకలమీద ప్రయోగిస్తారు. అంటే వాళ్లకి ఎలుకలమీద కోపమా? అందువల్ల మానవాళికి ప్రయోజనముంటుందని వాళ్లా పని చేశారు. నాదీ అలాంటి ప్రయోగం. కాకతాళీయంగా జరిగిన ఓ సంఘటనని, మనకు సంబంధం లేని ఓ వ్యక్తి మహిమగా అన్వయించబోతున్నాం. అది సరికాదని నిరూపించడానికి నేనిప్పుడు ఈ టేపుమీద ప్రయోగం చేశాను. అంతే తప్ప నాకు బాబా గారంటే భక్తీ లేదు, ద్వేషమూ లేదు. నువ్వే చూడు. ఇందాకటికంటే పరుషంగా మాట్లాడినా, టేపు ఆగిపోలేదు...."

శ్రీమతి నవ్వి, "నేను బాబాగార్ని దేవుడని అనుకుంటున్నానని ఎలా నిర్ణయించారు?" అంది.

ఊహించని ప్రశ్నే ఐనా, ఆ ప్రశ్న నా ప్రయోగ ఫలితంగా వచ్చిందని అనిపించింది. మనసులో కించిత్ గర్వం!

నేను బదులిచ్చేలోగా, "ఎన్నో విషయాల్లో మనమిద్దరం ఒకేలా ఆలోచిస్తాం. బాబా దేవుడైతే మనకేమిటి? కాకపోతే మనకేమిటి? ఐతే ఆయన ప్రపంచంలో ఎంతోమందిని ప్రభావితం చేసిన అపూర్వవ్యక్తి. ఆయన్ని నమ్మినవారిలో మనకంటే గొప్పవాళ్లూ, తెలివైనవాళ్లూ ఉన్నారు. వారిలో మన రావుగారు కూడా ఉన్నారు. అంతే, అక్కడితో ఆగిపోదాం అనుకుంటాను" అంది శ్రీమతి.

ఆ మాట సబబుగా అనిపించింది. కానీ రావుగారి ప్రసక్తి తేగానే, "రావుగారు మనకంటే అనుభవజ్ఞుడని నాకూ తెలుసు. కానీ ఆయన గుడ్డిగా ఓ వ్యక్తిని దేవుడని నమ్మడం బాగుందా? ఈ రోజిక్కడ జరిగిన అనుభవం ఆయనకి చెబితే ఆయన మారొచ్చేమో?" అన్నాను.

"ఎవరి ఆలోచనలైనా నమ్మకాన్ని బట్టి ఉంటాయి. నమ్మకమంటే రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది" అంది శ్రీమతి.

అని ఊరుకోలేదు. నా మాటలకి రావుగారేమంటారో కూడా ఆమె చెప్పింది.

నేనా మాటన్నప్పుడు టేపు ఆగిపోవడం కాకతాళీయం కాదు. మహిమ.

"చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు" అన్నది మనుషులే కాదు, దేవుడూ పాటిస్తాడు.

నేను మంచి మనిషిని. మంచితనానికి దైవభక్తి తోడైతే ఇంకా బాగుంటుందని బాబా అనుకున్నాడు. భువనేశ్వర్లో ఓ రావుగారి ద్వారా తన గురించి కొంత తెలియజెప్పాడు. జర్మనీ వచ్చేక ఈ రావుగారి ద్వారా తన గురించి వినిపించాడు. తన కథని చదివేలా చేశాడు. తన పాటలు వినేలా చేశాడు. ఆ వినడం కూడా ఒక రోజు కాదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు వినేలా రికార్డు చేసుకునేలా చేశాడు. తనమీద నమ్మకం కలుగుతుందని ఓ మహిమ కూడా చూపాడు. అప్పటికీ నమ్మకపోతే – ప్రస్తుతానికి ఊరుకున్నాడు.

'నన్ను నమ్మనివాళ్లలో నీలాంటివాళ్లూ, నీకంటే గొప్పవాళ్లూ చాలామందే ఉన్నారు. నాకు భక్తులుగా మారండిరా మొర్రో అంటూ వాళ్లందరి వెంటబడ్డమేనా నా పని? దుష్టశిక్షణా శిష్టరక్షణా – అదే నా పని. నువ్వు దుష్టుడివైతే తప్పక శిక్షిస్తాను. శిష్టుడివైతే నా భక్తుడివి కాకపోయినా రక్షిస్తాను. నన్ను నమ్మేది రక్షణ కోసం కాదు. నీ మనశ్శాంతి కోసం! కాబట్టి ఇది ఇక్కడితో ఆపేశాను' అన్నది బాబా పోలసీ అని రావుగారు ముగిస్తారుట.

"ఆయన్ని మార్చాలని మీరనుకుంటే, మిమ్మల్ని మార్చాలని ఆయననుకోవచ్చు. ఇక్కడ మనం గ్రహించని విషయమేంటంటే – ఇద్దరిలో ఎవరు మారకున్నా ప్రపంచానికి కలిగే నష్టమేంలేదు" అంది శ్రీమతి.

నిజమే ననిపించింది. తనంతటివాడు తను రావుగారు. ఆయన విచక్షణాజ్ఞానాన్ని సవాలు చెయ్యడానికి నేనెంతటివాణ్ణి?

“నిజం వసూ! మనమిద్దరం ఒకేలా ఆలోచిస్తాం. కానీ, అది తెలుసుకుందుకు ఒకోసారి ఇంతసేపు పడుతుంది. ఇక మనం దేవుడి గురించిన ఆలోచనలు పక్కనపెట్టి జీవుడి గురించి ఆలోచిద్దాం” అన్నాను.

అప్పటికా సంభాషణ అలా ముగిసినా, దేవుడికి మమ్మల్ని వదలాలని ఉన్నట్లు లేదు.

ఆ రోజు పక్కనే ఉన్న అనుభూతినిచ్చిన దేవుడు మరొరోజు సరాసరి మా ఇంటికే వచ్చేశాడు.

అదెలా జరిగిందంటే......

మరో రూపంలో దేవుడు

బుధ, శనివారాల్లో ఉదయంనుంచి మధ్యాహ్నం రెండింటిదాకా గ్యోతే స్ట్రాసేలో కూరగాయల సంత జరుగుతుందని చెప్పాను కదా...

మా ఇంటికి పదడుగుల దూరమే కాబట్టి, శనివారం వస్తే సాధారణంగా మొత్తం నలుగురం ఆ సంతకు వెళ్ళేవాళ్లం.

అక్కడ ఆదిలో శ్రీమతి కట్టూ బొట్టూ ఒక ఆసక్తికరమైన అంశంగా ఉండేది. ఎందుకంటే....

అప్పట్లో తెలుగు నాట ఆడపిల్లలు పరికిణి వోణీలో, చీరలో ధరించేవారు. ఇతర డ్రస్సులు ఇంకా వాడకంలోకి రాలేదు.

భువనేశ్వర్లో ఒరియా అమ్మాయిలు టీనేజిలో చుడీదార్లు, పంజాబీ డ్రెస్సులు కట్టేవారు. వివాహితులైన ఒరియా మహిళలు మాత్రం డ్రెస్సులు కాకుండా, చీరలే కట్టేవారు. అక్కడికొచ్చేసరికి శ్రీమతి ఇంకా టీనేజిలోనే ఉన్నా, వివాహిత కాబట్టి చీరలే కట్టేది.

చీరలు తనకి ఎంతలా అలవాటైపోయాయంటే, జర్మనీ వచ్చేక అక్కడి వాతావరణానికి అనుగుణంగా పాంట్లు వేసుకుందుకు సుతరామూ ఇష్టపడలేదు.

ఇంకా చెప్పాలంటే పాంట్లు వేసుకున్న భారతీయ మహిళల్ని చూసినప్పుడు – వాళ్లేదో తప్పు చేస్తున్న అనుభూతి కలిగేది తనకి!

అక్కడ పరిచయమైన తెలుగు మహిళలు ఒకరినొకరు కలుసుకున్నప్పుడు, అక్కడికొచ్చీ చీరల్నే కట్టడాన్ని మెచ్చుకోతగ్గ గొప్ప విశేషంగా భావించేవారు.

ఓవరుకోట్లు వేసుకుంటే చీర వేసుకున్నా, పాంటు వేసుకున్నా తేడా తెలియదు. కానీ తను మోకాళ్లకు కాస్త పైదాకా మాత్రమే వచ్చే ఉలెన్ జాకెట్ వేసుకునేది. అందువల్ల చీర కట్టు తెలిసిపోయేది. జర్మన్ మహిళలు అదో విడ్డూరమన్నట్లు చూసేవారు.

కొంతమంది పని కట్టుకుని పలకరించి – చీరకి గుడ్డ ఎంత పడుతుందని అడిగి అయిదు మీటర్లని తెలిసి గుండెలు బాదుకునేవారు.

శ్రీమతిలో అక్కడివారికి మరో విడ్డూరం నుదుటి బొట్టు. వాళ్లు దాన్ని రోట్ పుంక్ట్ (ఎర్రచుక్క) అనేవారు.

అప్పటికింకా సాధారణ మహిళలు బొట్టుని అలంకరణ అనుకునేవారు కాదు. ఏ రంగు చీర కట్టినా బొట్టు రంగు ఎరుపే ఉండేది.

అది అలంకరణ కాదనీ, సంప్రదాయమనీ చాలామంది జర్మన్ మహిళలకు అర్థమైంది. అదేమిటనీ, ఎందుకనీ అడిగేవారు.

పాశాత్యులు తామేం పాటించినా — దానిపట్ల వారికి స్పష్టమైన అవగాహన ఉంటుంది.

మనకి అలా కాదు. పెద్దలు చెప్పారని చేస్తాం. కానీ వాళ్లెందుకు చెప్పారో తెలియదు.

తెలుసుకుందామన్నా ఆ పెద్దలు కూడా ఒకొక్కరు ఒకోలా చెబుతారు.

శ్రీమతిని బొట్టు గురించి అడిగినవారికి – తెలిసీ తెలియని పరిజ్ఞానంతో, వచ్చీరాని భాషలో ఏదో ఒకటి చెప్పేవాళ్లం.

కొందరు తృప్తి పడేవారు. కొందరు తృప్తి నటించేవారు.

మేము సంతకి వెళ్లినప్పుడు చాలా కళ్లు, ముఖ్యంగా ఆడవాళ్లవి శ్రీమతిని కుతూహలంగా చూసేవి.

మేము తిరిగి చూస్తే వాళ్లు పలకరింపుగా ఓ నవ్వు నవ్వేవారు.

అలాంటిది ఒకరోజున సంతలో, ‘నమస్తే!’ అన్న మాట విని ఉలిక్కిపడ్డాను.

ఆ ఉచ్చారణ తెల్లవారి తెలుగు మాటలా ఉంది.

అటు చూస్తే — ఓ తెల్లతను చేతులు జోడించి కనిపించాడు.

నాకంటే కొంచెం పెద్దవాడిలా ఉన్నాడు. శ్రీమతినే కుతూహలంగా చూస్తున్నాడు.

నేను రెండు చేతులూ జోడించి, “నమస్తే!” అన్నాను.

“ఇండియన్!?” అన్నాడతడు.

అది ప్రశ్న కాదు. మీరు ఇండియన్సని నాకు తెలిసిందని అన్నట్లుంది.

“స్ప్రెషెన్ జీ ఇంగ్లీష్?” (ఇంగీషు తెలుసా) అన్నాను.

తలూపాడు కానీ ఇంగ్లీషు మాట్లాడలేదు. మళ్లీ ‘నమస్తే!’ అన్నాడు ఈసారి శ్రీమతివైపు చూస్తూ.

తననుంచి ప్రతి నమస్కారం రాలేదని గుర్తు చేస్తున్నాడని గ్రహించి, తనూ చేతులు జోడించి, “నమస్తే!” అంది శ్రీమతి.

అతగాడు చిరునవ్వు నవ్వి వెళ్లిపోయాడు.

అంతటితో ఆ కథ ముగిసిందనుకున్నాం కానీ, మరుసటి శనివారం కూడా అతడు కనబడి మాకు నమస్తే చెప్పాడు.

ఆ తర్వాతనుంచి సంతలోనే కాదు, బయట షాపుల్లో కనబడినప్పుడు కూడా అతడు మాకు నమస్తే చెప్పి వెళ్లేవాడు.

స్నేహపూర్వకమైన చిరునవ్వు, చిత్రమైన ఉచ్చారణతో నమస్తే అన్న పదం – మాకు బాగా అనిపించేవి.

ఐతే మా స్నేహాన్ని ఇంకాస్త దూరం తీసుకెళ్లడానికి మావైపునుంచి ప్రయత్నించలేదు. కారణం – భాష!

ఒకరోజు అతడి మాటలు నమస్తే దగ్గర ఆగిపోలేదు. “నేను మీతో కాసేపు మాట్లాడొచ్చా?” అన్నాడు మొదటిసారిగా ఇంగ్లీషులో.

“ష్యూర్” అన్నాను వెంటనే.

అతడో క్షణం తటపటాయించాడు.

నాలో కుతూహలం – అతడేం చెబుతాడోనని!

“నా పేరు విలియమ్స్” అన్నాడతడు.

ఇన్నాళ్ల పరిచయం తర్వాత అతగాడి పేరు తెలిసింది. బాగుండదని – నేను నా పేరు, శ్రీమతి పేరు చెప్పాను.

అతడికి పేర్లమీద ఆసక్తి ఉన్నట్లనిపించలేదు. బహుశా ఆ పేర్లు గుర్తుంచుకోడానికి కూడా కష్టమనిపించాయేమో!

అదోలా చూస్తూ, “మీరు హిందువులు కదూ!” అన్నాడతడు.

ఉలిక్కిపడ్డాను.

జర్మనీ వచ్చేక అంతవరకూ నా మతం ప్రసక్తి వచ్చినట్లు గుర్తు లేదు. ఎవరు పరిచయం చేసుకున్నా నన్ను ఇండియన్‌గా మాత్రమే గుర్తించేవారు.

ల్యూనబర్గులో పాకిస్తానీయులతో పరిచయమైనా – దేశం పేరే తప్ప మతం స్ఫురించలేదు.

“ఇదేమిటీ, ఇలా అడిగాడు?” అనుకున్నాను కొంచెం ఇబ్బందిగా.

ఐతే ఆ ఇబ్బంది అంతటితో ఆగేది కాదని అప్పుడు తెలియదు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments